నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్ - నిర్మల్
5 | నిజామాబాద్ ఆదివారం 22 డిసెంబర్ 2024 | ADILABAD NIRMAL

మాట్లాడుతున్న జడ్పీ మాజీ చైర్మన్ రాథోడ్ జనార్దన్

సీఆర్టీల డిమాండ్లను పరిష్కరించాలి

ఉట్నూర్, డిసెంబర్ 21 : సీఆర్టీల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని జడ్పీ మాజీ చైర్మన్ రాథోడ్ జనార్దన్ అన్నారు. శనివారం స్థానిక ఐటీడీఏ కార్యాలయం ఎదుట నిర్వహిస్తున్న రిలే దీక్షలకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సీఆర్టీలు చేపడుతున్న రిలే దీక్షతో విద్యార్థులకు విద్య అందడం లేదన్నారు. సీఆర్టీల తొమ్మిది డిమాండ్లు న్యాయమైనవన్నారు. సీఆర్టీల సమస్యలను పరిష్కరించకుంటే ఆందోళన ఉధృతం చేసి అసెంబ్లీని ముట్టడిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, సీఆర్టీలు, తదితరులు ఉన్నారు.

జాతీయ రహదారిపై ఎస్ఎస్ఏ ఉద్యోగుల నిరసన

కొనసాగుతున్న ఎస్ఎస్ఏ ఉద్యోగుల నిరసన

నిర్మల్ అర్బన్, డిసెంబర్ 21 : సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగ, ఉపాధ్యాయులు తమ న్యాయమైన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ నిర్మల్ పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట చేపడుతున్న నిరవధిక సమ్మె శనివారం నాటికి 12వ రోజుకు చేరుకున్నది. ఈ నిరసనలో భాగంగా ఎస్ఎస్ఏ లోగోను వేసి తమ నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఏ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు గంగాధర్, రాజారత్నం, నరేశ్, తిరుపతి, నవిత, వీణ, అపర్ణ, పుష్పలత, రాధిక, శ్రీతల, గంగామణి, ప్రభ, సునీత పాల్గొన్నారు.

కలెక్టర్ చౌరస్తాలో రాస్తారోకో చేస్తున్న కాంట్రాక్ట్ ఏఎన్ఎంలు

రాత పరీక్ష లేకుండా రెగ్యులర్ చేయాలి

ఎదులాపురం, డిసెంబర్ 21 : కాంట్రాక్ట్ ఏఎన్ఎంలను రాత పరీక్ష లేకుండా రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం తెలంగాణ వైద్య, ఆరోగ్య సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో కలెక్టర్ చౌరస్తాలో రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంట్రాక్టు ఏఎన్ఎంలను రెగ్యులర్ చేయాలని, గతంలో సమ్మె సందర్భంగా ఏఎన్ఎంల కోసం ప్రభుత్వం 2024 సెప్టెంబర్ 2న ముగ్గురు సభ్యులతో కమిటీ ఏర్పాటు చేసిందన్నారు. ఆ కమిటీ ప్రభుత్వానికి నివేదిక ఇవ్వకముందే రాష్ట్ర ప్రభుత్వం మళ్లీ రాత పరీక్ష పెడుతుందన్నారు. వెంటనే రాత పరీక్షను రద్దు చేయాలన్నారు. వైద్య, ఆరోగ్య శాఖలో కాంట్రాక్టు పద్ధతిలో పని చేస్తున్న డాక్టర్లను ఎటువంటి రాత పరీక్ష లేకుండా రెగ్యూలర్ చేశారన్నారు. అదే పద్ధతిలో కాంట్రాక్టు ఏఎన్ఎంలను కూడా రాత పరీక్ష లేకుండా రెగ్యూలర్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి కిరణ్, జిల్లా అధ్యక్షుడు బొజ్జ ఆశన్న, ఏఎన్ఎంలు పుష్పల, ఆనందబాయి, పద్మ, తులసి, లలిత, మనీలత, ప్రియదర్శిని, సులోచన, అహల్య, లక్ష్మి, కరుణ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎస్పీ జానకి షర్మిల

బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలి

నిర్మల్ అర్బన్, డిసెంబర్ 21 : సిబ్బంది, ఉద్యోగులు క్రమశిక్షణ, నీతి నిజాయితీ, సమయపాలన పాటిస్తూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని ఎస్పీ జానకి షర్మిల అధికారులను ఆదేశించారు. శనివారం నిర్మల్ జిల్లా పోలీసు కార్యాలయంలో సెట్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఫిర్యాదుదారులతో మర్యాద పూర్వకంగా ప్రవర్తించాలని మెన్, ఉమెన్ అనే తేడా లేకుండా విధులు నిర్వహించాలని సూచించారు. సెట్ కాన్ఫరెన్స్‌లో అడిషనల్ ఎస్పీ ఉపేందర్ రెడ్డి, ఏఎస్పీ అవినాశ్ పాల్గొన్నారు.

గ్రామీణ బ్యాంకు అధికారులు, గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్పీ గౌష్ ఆలం

భద్రతా చర్యలు పాటించాలి

ఆదిలాబాద్ ఎస్పీ గౌష్ ఆలం

ఎదులాపురం, డిసెంబర్ 21 : బ్యాంకుల వద్ద భద్రతా చర్యల్లో భాగంగా ఉన్నతమైన నూతన అత్యాధునిక పరికరాలను వినియోగించి భద్రతా చర్యలను చేపట్టాలని ఎస్పీ గౌష్ ఆలం తెలిపారు. శనివారం ఆదిలాబాద్ రూరల్ మండలంలోని రామాయ తెలంగాణ గ్రామీణ బ్యాంకులో వారం రోజుల క్రితం అంతర్రాష్ట్ర దొంగల ముఠా దొంగతనానికి యత్నించిన విషయం తెలిసిందే. ఈ మేరకు బ్యాంకు సిబ్బందితో భద్రతా చర్యలు, ఏర్పాట్లపై సమీక్షించి పరిశీలించారు. స్థానిక పోలీస్ హెడ్ క్వార్టర్స్ సమావేశ మందిరంలో అదనపు ఎస్పీ సురేందర్‌రావు ఆధ్వర్యంలో తెలంగాణ గ్రామీణ బ్యాంకు జిల్లా మేనేజర్లు, రీజనల్ మేనేజర్ ఆధ్వర్యంలో భద్రతా చర్యలపై సమీక్షించారన్నారు. బ్యాంకుల వద్ద రాత్రి సమయాల్లో సెక్యూరిటీ గార్డులను ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో డీఎస్పీ జీవన్‌రెడ్డి, సీఐలు సునీల్ కుమార్, సాయినాథ్, వెంకటేశ్వరరావు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ వెంకటి, తెలంగాణ గ్రామీణ బ్యాంకు రీజినల్ అధికారి ప్రభుదాస్, తదితరులు పాల్గొన్నారు.

ఆటపాటలతో నిరసన

బతుకమ్మ ఆడుతూ నిరసన తెలుపుతున్న సమగ్రశిక్ష ఉద్యోగులు

ఎదులాపురం, డిసెంబర్ 21 : ఆదిలాబాద్ కలెక్టరేట్ ఎదుట సమగ్ర శిక్ష ఉద్యోగులు చేపట్టిన సమ్మె శనివారం నాటికి 12వ రోజుకు చేరుకున్నది. ఈ సమ్మెలో భాగంగా శనివారం ఎన్టీఆర్ చౌక్‌లో సమగ్ర శిక్ష ఉద్యోగులు రోడ్డుపై కూర్చొని భోజనం చేసి నిరసన తెలిపారు. ఎన్నికల్లో సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు ప్రియాంక, దీప్తి, మల్లిక, నవీన, కవిత, హిమబిందు, పార్థసారథి, కేశవ్, వెంకటి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

మళ్లీ మోసానికి కాంగ్రెస్ కుట్ర

సంక్రాంతి అనంతరం రైతు భరోసా ఇస్తామంటూ ప్రకటన

- విధివిధానాలపై అసెంబ్లీ స్వల్పకాలిక చర్చలో ఏం చెప్పకుండా దాటవేత
- స్పష్టత ఇవ్వని సీఎం రేవంత్‌రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల
- రుణమాఫీ లెక్కనే రైతు భరోసా చేస్తారని రైతుల మండిపాటు

మంచిర్యాల, డిసెంబర్ 21(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ''మేం అధికారంలోకి వస్తే రుణమాఫీ రూ.2 లక్షలు చేస్తం. రైతుబంధు ఎకరాకు రూ.15 వేలు ఇస్తం.. బ్యాంకుకు వెళ్లి రూ.2 లక్షలు ఇప్పుడే తెచ్చుకోండి.. అధికారంలోకి వచ్చిన వెంటనే డిసెంబర్ 9న మాఫీ చేస్తం..'' అని కాంగ్రెస్ నాయకులు అసెంబ్లీ ఎన్నికలకు ముందు గొప్పలు చెప్పుకున్నరు. అధికారంలోకి వచ్చి యేడాది గడిచినా పూర్తిస్థాయిలో రుణమాఫీ, రైతు భరోసా ఇవ్వలేదని రైతులు మండిపడుతున్నారు. కొందరికి మాఫీ అయితే మరికొందరికి సాంకేతిక కారణాలు చూపుతూ చేతులు దులుపుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడు రైతులను బురిడీ కొట్టించేందుకు రైతు భరోసా పేరిట కొత్త నాటకానికి తెరలేపిందని రైతు సంఘాల నాయకులు మండిపడుతున్నారు. రైతు భరోసా విధివిధానాలపై అసెంబ్లీలో స్వల్పకాలిక చర్చ అని పెట్టి అసలు విధివిధానాలే రూపొందించలేదని చెప్పడం కాంగ్రెస్ సర్కార్‌కే చెల్లుతుందన్నారు. రెండు సీజన్‌లు పెట్టుబడి సాయం ఊసెత్తని సర్కారు.. ఇప్పుడు ఉన్నఫలంగా సంక్రాంతికి రైతు భరోసా ఇస్తుందంటే నమ్మశక్యంగా లేదని వాపోతున్నారు.

అందరికీ భరోసా లేనట్లే..

అసెంబ్లీలో రైతుభరోసా చర్చ సందర్భంగా వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాటలను బట్టి చూస్తే రైతుభరోసా అందరికీ ఇవ్వరనేది స్పష్టంగా తెలిసిపోతుందని రైతులు వాపోతున్నారు. రుణమాఫీకి పెట్టినట్లే కొర్రీలు పెట్టి సగం మంది రైతులకే పెట్టుబడి సాయం అందించేందుకు కుట్రలు చేస్తున్నారని మండిపడుతున్నారు. ఇచ్చిన హామీ మేరకు ఎకరానికి రూ.15వేల చొప్పున రైతులందరికీ రైతు భరోసా ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేస్తున్నారు. బీఆర్ఎస్ సర్కార్ కేసీఆర్ హయాంలో ఏడాదికి రూ.15 వేల కోట్ల చొప్పున రూ.72,816 కోట్లు రైతుబంధు పథకం కింద రైతుల ఖాతాల్లో జమ చేసింది. కాంగ్రెస్ వచ్చాక రెండు సీజన్లుగా రైతుబంధు ఊసేలేదని వాపోతున్నారు. అసెంబ్లీలో మాట్లాడేప్పుడు అసలు ప్రభుత్వం ఏం విధివిధానాలు అనుకుంటుందో చెప్పకుండా.. కేవలం గత ప్రభుత్వాన్ని విమర్శించడంపైనే సీఎం దృష్టి సారించడం ఏంటని మండిపడుతున్నారు. గతంలో రైతుబంధు రాని రైతు లేడని, అదే తరహాలో కాంగ్రెస్ సర్కార్ కూడా రైతులందరికీ రైతుభరోసా ఇవ్వాలని రైతు సంఘాల నాయకులు, రైతులు డిమాండ్ చేస్తున్నారు.

షరతుల్లేకుండా రైతు భరోసా ఇవ్వాలి

చెన్నూర్ రూరల్, డిసెంబర్ 21 : ప్రభుత్వం ఎలాంటి షరతులు లేకుండా రైతులందరికీ రైతు భరోసా అందించాలి. ఎన్నికల సమయంలో అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చారు. ప్రధానంగా ఎకరాకు రూ. 15 వేలు ఇస్తామని చెప్పారు. కానీ అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా ఇచ్చిన మాటను నిలబెట్టుకోలేదు. ఇకనైనా రైతు భరోసాను అమలు చేసి ఆదుకోవాలి.

- కాళేశ్వరం సమ్మగౌడ్, కొమ్మెర రైతు

విధి విధానాల పేరిట కాలయాపన

నిర్మల్, డిసెంబర్ 21 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులను నిలువునా ముంచింది. ఏ ఒక్క హామీని కూడా సక్రమంగా అమలు చేయడం లేదు. ముఖ్యంగా రైతుబంధు స్థానంలో రైతు భరోసా పథకాన్ని అమలు చేసి ఎకరానికి రూ.15 వేల ఆర్థిక సాయాన్ని చేస్తామని ఎన్నికలకు ముందు చెప్పారు. కానీ.. అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్నా రైతు భరోసాను అమలు చేయలేదు. గత వానకాలం పెట్టుబడి సాయాన్ని ఇవ్వకుండా కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేసింది. ఇప్పుడు మంత్రివర్గ ఉప సంఘాన్ని ఏర్పాటు చేసి రైతు భరోసా అమలు కోసం విధివిధానాలను రూపొందిస్తున్నామంటూ కాలయాపన చేస్తున్నారు. ఎన్నికలకు ముందు ఇలాంటి ఆంక్షలు పెడతామని చెప్పలేదు కదా. కేవలం రైతులను మభ్య పెట్టేందుకే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పని చేస్తున్నది. వచ్చే సంక్రాంతికి రైతు భరోసా ఇస్తామని వ్యవసాయ శాఖ మంత్రి అసెంబ్లీలో ప్రకటించినప్పటికీ.. రైతులకు నమ్మకం కలగడం లేదు. ఒకవేళ ఇస్తే రైతులందరికీ ఇస్తారా? కొందరికే ఇస్తారా? స్పష్టత ఇవ్వాలి. గత కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చినట్లు ప్రతి రైతుకు పెట్టుబడి సాయాన్ని అందజేయాలి. గత వానకాలం సీజన్‌తోపాటు ప్రస్తుత యాసంగికి సంబంధించి రెండు సీజన్ల పెట్టుబడి సాయాన్ని సంక్రాంతిలోపు ఇచ్చి రైతులందరిని ఆదుకోవాలి.

- సునారికారి రాజేశ్, సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ నాయకులు, ఖానాపూర్.

హామీలు నెరవేర్చని కాంగ్రెస్

- సంక్రాంతికి పథకాలు అమలంటున్న మంత్రులు
- ప్రభుత్వ పథకాలపై సర్వే
- రైతులతో కలిసి ఆందోళనలు చేస్తాం..
- మాజీ మంత్రి జోగు రామన్న

ఆదిలాబాద్, డిసెంబర్ 21(నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ ప్రభుత్వం రైతులు, ప్రజలను మరోసారి మోసం చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నదని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. శనివారం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రామన్న మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం.. యేడాది గడిచినా ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని తెలిపారు. రూ.2 లక్షల రుణమాఫీ, రైతు భరోసా, రైతు కూలీలకు ఆర్థిక సాయం, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు సంక్రాంతి అంటూ మరోసారి ముహూర్తం నిర్ణయించారని తెలిపారు. ఈ లోగా ఎన్నికల ప్రకటన వెలువడే అవకాశాలుండగా.. కోడ్ పేరిట తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికే రైతులకు రెండు విడుతలుగా రైతు భరోసా ఎగ్గొట్టిన ప్రభుత్వం, రుణమాఫీ విషయంలో అన్నదాతలకు అన్యాయం చేసిందన్నారు. ముఖ్యమంత్రి చెప్పిన విధంగా రాష్ట్రంలో ఇప్పటికే 20 లక్షల మంది రైతులకు రుణమాఫీ జరుగగా.. ఇంకా 11 లక్షల మంది రైతుల బ్యాంక్ లోన్‌లు రద్దు కాలేదని తెలిపారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి జోగు రామన్న

జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు చేస్తాం

రూ.2 లక్షల రుణమాఫీకి సంబంధించి బీఆర్ఎస్ నాయకులు గ్రామాల్లో సర్వే చేస్తున్నారని, ఎంతమంది రైతులకు రుణమాఫీ జరిగిందనే విషయాలను తెలుసుకుంటున్నారన్నారు. నాలుగో విడుతలో జిల్లాలో 6,600 మందికి రుణమాఫీ చేసినట్లు ప్రభుత్వం ప్రకటించినా.. ఇప్పటి వరకు డబ్బులు రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ కాలేదని తెలిపారు. జిల్లాలో చాలా మంది రూ.2 లక్షల రుణమాఫీకి అర్హులుగా ఉన్నారని, వారి వివరాలు సేకరించి కలెక్టర్, ప్రభుత్వానికి పంపిస్తామని తెలిపారు. జిల్లాలో వాస్తవ పరిస్థితులను తెలుసుకునేందుకు ఇన్‌చార్జి మంత్రి సీతక్క, వ్యవసాయ శాఖ మంత్రి తమ్మల నాగేశ్వర్‌రావులు గ్రామాల్లో పర్యటించాలని సూచించారు. ప్రభుత్వం అర్హులైన రైతులకు రుణమాఫీ చేయకపోతే మండల కేంద్రాలు, జిల్లా కేంద్రాల్లో రైతులతో కలిసి ఆందోళన చేస్తామని తెలిపారు. జిల్లాలో పంటల కొనుగోళ్ల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు అన్యాయం చేస్తుందన్నారు. జిల్లాలో సోయాబిన్ కొనుగోళ్లు నిలిచిపోయాయన్నారు. రైతుల వద్ద ఇంకా 2 లక్షల క్వింటాళ్ల పంట ఉత్పత్తుల నిల్వలు ఉన్నాయని, ప్రైవేటు వ్యాపారులకు పంటను విక్రయించి నష్టపోతున్నారన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు సాజిదొద్దీన్, సెవ్వ జగదీశ్, విజ్జిగిరి నారాయణ, రాజన్న, గండ్రత్ రమేశ్, కుమ్ర రాజు, పరమేశ్వర్, గంగయ్య, బట్టు సతీశ్, ఉగ్గే విఠల్, దయాకర్, తదితరులు పాల్గొన్నారు.

రూ.50 వేలు కాజేసిన బ్యాంకు సిబ్బంది

బ్యాంకు స్టేట్‌మెంట్ చూపిస్తున్న రైతు ఆత్రం రాందాస్

బేల, డిసెంబర్ 21 : ఖాతాలోని డబ్బులను బ్యాంకు అధికారులు కాజేసిన ఘటన మండలంలో చోటు చేసుకున్నది. మనియార్‌పూర్ గ్రామానికి చెందిన రైతు ఆత్రం రాందాస్ ఈ యేడాది ఆగస్టు 28వ తేదీన మండల కేంద్రంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకుకు వెళ్లి రూ.50 వేలు డ్రా చేసేందుకు విత్ డ్రా ఫాం రాసి ఇచ్చాడు. దాంతో రూ.20 వేలు మాత్రమే ఇస్తామని మరో విత్ డ్రా ఫాం రాయమని బ్యాంక్ సిబ్బంది సూచించారు. దాంతో రూ.20 వేలకు ఫాం రాసి ఇచ్చాడు. కానీ.. ముందుగా రూ.50 వేల కోసం రాసి ఇచ్చిన మరో విత్ డ్రా ఫాం తిరిగి ఇవ్వకుండా తన వద్దనే ఉంచుకున్నారు. ఇటీవల మళ్లీ రూ.50 వేల కోసం బ్యాంకుకు వెళ్లగా ఖాతాలో డబ్బులు లేవని తెలుపడంతో నా ఖాతాలో డబ్బులు ఎటు పోయానని అరా తీశాడు. బ్యాంక్ స్టేట్‌మెంట్‌లో ఒకే తేదీన డబ్బులు విత్ డ్రా చేసినట్లు చూపించింది. దీనిపై రైతు బ్యాంక్ అధికారులను సమాధానం అడగగా.. తమకేమి తెలియదని సమాధానం దాట వేశారని తెలిపారు. బ్యాంక్ అధికారులే తనకు అన్యాయం చేశారని శుక్రవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపాడు. ఈ విషయమై బ్యాంక్ అధికారులను వివరణ కోరగా.. ఒకే తేదీపై విత్ డ్రా అవడం వాస్తవమేనని.. కానీ డబ్బులు ఎవరు తీసుకున్నారో తెలియడం లేదని, సీసీ కెమెరాలు చూసిన తర్వాతనే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని బ్యాంక్ అధికారులు తెలిపారు.

మత్తు పదార్థాలను అంతం చేయాలి

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా

ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా

ఎదులాపురం, డిసెంబర్ 21 : ఆదిలాబాద్ జిల్లాలో గంజాయి, నార్కొటిక్ మత్తు పదార్థాలను అంతం చేసేలా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ రాజర్షి షా ఆదేశించారు. శనివారం కలెక్టర్ ఛాంబర్‌లో కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ గౌష్ ఆలం ఆధ్వర్యంలో అధికారులతో నార్కొటిక్-కో-ఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాల బారిన ప్రజలు పడకుండా అవగాహన చేపట్టాలని తెలిపారు. సారథి కళాకారులతో క్షేత్రస్థాయిలో ప్రచారం నిర్వహించాలన్నారు. ఎస్పీ మాట్లాడుతూ.. ఈ ఏడాది 75 కేసులు నమోదయ్యాయని, ఇప్పటివరకు 987.425 కిలోల గంజాయిని పట్టుకుని, సుమారు రూ.2.31 కోట్ల గంజాయిని పట్టుకున్నామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్యామలా దేవి, సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మట్, ట్రెయినీ కలెక్టర్ అభిగ్యాన్, ఆర్డీవో వినోద్ కుమార్, డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్, రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ అడె శ్రీలత పాల్గొన్నారు.

ఈవీఎం గోదాం పరిశీలన..

ప్రతి నెల తనిఖీలో భాగంగా శనివారం జిల్లా కేంద్రంలోని శాంతినగర్‌లో ఈవీఎం గోదాంను వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, అదనపు కలెక్టర్ శ్యామలాదేవితో కలిసి కలెక్టర్ రాజర్షి షా పరిశీలించారు.

నిర్మల్‌లో రాస్తారోకో చేస్తున్న ఏఎన్ఎంలు

రెగ్యులర్ చేయాలని రాస్తారోకో

నిర్మల్ చైన్‌గేట్, డిసెంబర్ 21 : రాత పరీక్ష లేకుండా కాంట్రాక్టు ఏఎన్ఎంలను రెగ్యులర్ చేయాలని కోరుతూ శనివారం నిర్మల్‌లో పెద్ద ఎత్తున రాస్తారోకో నిర్వహించి ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఏఎన్ఎలు మాట్లాడుతూ.. 20 ఏళ్ల నుంచి ఏఎన్ఎంలుగా విధులు నిర్వహిస్తున్నామన్నారు. ప్రభుత్వం రెగ్యులర్ చేయాల్సిందిపోయి రాతపరీక్ష పెడతామని నిర్ణయం తీసుకోవడం సబబు కాదన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కాంట్రాక్టు ఏఎన్ఎంలను రెగ్యులర్ చేయాలన్నారు. రాస్తారోకో వల్ల వాహనాలు నిలిచిపోయాయి. సమస్య పరిష్కరించకుంటే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు పాల్గొన్నారు.